క్లుప్తంగా

పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం



జి.కొత్తపల్లి డ్రైనేజీలో పూడిక తీస్తున్న పంచాయతీ సిబ్బంది

శంఖవరం: గ్రామంలో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు జి.కొత్తపల్లి సర్పంచ్ ఈగల విజయదుర్గ తెలిపారు. మండలంలోని జి.కొత్తపల్లిలో సోమవారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాతీయ సిబ్బంది డ్రైనేజీల్లో పూడికతీత పనులు చేపట్టారు. రోడ్లకు ఇరువైపులా బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మహిళలు తమ ఇళ్లలోని వ్యర్థాలను ఆరుబయట వేయకుండా చెత్త బుట్టల్లో వేసి పంచాయతీ సిబ్బందికి సహకరించాలని కోరారు.

అరుణాచలేశ్వరస్వామికి రుద్రాభిషేకం



విశేష అలంకరణలో రాచపల్లి అరుణాచలేశ్వరస్వామి వారు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లిలో వేంచేసిన అపిత కూచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామికి సోమవారం సామూహిక మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. ఉదయం పండితులు స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. శ్రీరమణా సేవాశ్రమం వ్యవస్థాపకుడు స్వామి రామానంద ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఓజోన్ పొర పరిరక్షణకు కృషి చేయాలి

గండేపల్లి: ఓజోన్ పొర పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని జాతీయ పర్యావరణ మిత్ర అవార్డు గ్రహీత తోటకూర గంగాధర్, ఆదిత్య యూనివర్సిటీ ప్రొఫెసర్ బీవీవీఎస్ భీమేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అనంతరం విద్యార్థులకు ఓజోన్ పొర ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ పున్నం నాగేశ్వరరావు, నెక్కంటి రామ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

గోకవరం: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేసినట్టు కొత్తపల్లి వైద్యాధికారి డాక్టర్ బి.తిరన్ తెలిపారు. మండలంలో మొత్తం 13,995 మందికి నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేయడం లక్ష్యమన్నారు. దీనికి సంబంధించి సోమవారం ప్రభుత్వాస్పత్రిలో సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓలు డీఎస్ మూర్తి, ఎస్.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రత్నగిరిపై నేటి నుంచి 'స్వచ్ఛతా హీ సేవ'

అన్నవరం: స్థానిక వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో మంగళవారం నుంచి స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించనున్నట్టు దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ తెలిపారు. దీనిలో భాగంగా అక్టోబర్ 1వ తేదీ వరకూ పలు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. చేపట్టే కార్యక్రమాల ప్రణాళికను ఇప్పటికే సర్క్యులర్ రూపంలో దేవస్థానం సిబ్బందికి తెలియజేశారు.

ఓజోన్ రక్షణ అందరి బాధ్యత

కాకినాడ సిటీ: ఓజోన్ పొర పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఏపీ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి సభ్య కార్యదర్శి బీవీఏ కృష్ణమూర్తి అన్నారు. ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా ఏపీ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి (ఆఫ్‌కాస్ట్)లో వివిధ పాఠశాలల విద్యార్థులకు జిల్లా స్థాయిలో పర్యావరణంపై వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ, ఏకపాత్రాభినయం పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ పోటీలకు 54 పాఠశాలల నుంచి 386 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఆధునిక జీవనం పేరిట రిఫ్రిజిరేటర్లు, ఎయిర్ కండీషనర్ల వాడకం పెరగడం కూడా ఓజోన్ పొరపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయన్నారు. జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీనివాస్ వినీల్, కాకినాడ జిల్లా ఉప విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు, ఎంఈఓ సీహెచ్ రవి, చేయూత ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.రవికుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో కందుకూరి మెర్సీ సుబ్బారావు ఫౌండేషన్ అధ్యక్షుడు కె.పాల్‌రాజ్ పాల్గొన్నారు.



అన్నవరం పంపా నదిలో గణపతి విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న పండితులు



ధర్మవరంలో గణపతిని ఊరేగిస్తున్న భక్తులు



కిర్లంపూడిలో నిమజ్జనానికి తరలివెళుతున్న గణనాథులు

ఊరూరా నిమజ్జనాల సందడి

- వైభవంగా వినాయక విగ్రహాల నిమజ్జనం
- ఊరేగింపులో సందడి చేసిన యువత, మహిళలు
- గ్రామాల్లో అన్న సమారాధనలు



ఏలేశ్వరంలో గణపతి విగ్రహాన్ని ఊరేగిస్తున్న మహిళలు

ఏలేశ్వరం: గణపతి నవరాత్రులు ముగియడంతో తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో సోమవారం నిమజ్జనం సందడి నెలకొంది. గ్రామాలు, పట్టణాల్లో తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న గణనాథులు గంగమ్మ ఒడికి చేరారు. గ్రామాల్లో స్వామివారి ఊరేగింపు కన్నుల పండువగా జరిగింది. ఏలేశ్వరం పట్టణంలోని పాత బస్టాండ్, షిర్డీ నగర్, దిబ్బలపాలెం, లింగవరం కాలనీ తదితర ప్రాంతాల్లో వినాయక విగ్రహాలను తీన్‌మార్, బ్యాండ్ మేళం, బాణాసంచా కాల్పుల నడుమ ఊరేగించి నిమజ్జనం చేశారు. స్థానిక మెయిన్ రోడ్డు, బాలాజీ చౌక్, మార్కెట్ రోడ్డు, పల్లపు వీధి మీదుగా ఊరేగింపు సాగింది. నిమజ్జనంలో మహిళలు, యువకులు సందడి చేశారు.

ప్రత్తిపాడు రూరల్: మండల వ్యాప్తంగా గణపతి నిమజ్జనాలు సోమవారం వైభవంగా జరిగాయి. తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న వినాయకుడిని గ్రామాల్లో బాణసంచా కాల్పులు, తీన్‌మార్ డ్యాన్స్‌ల నడుమ ఊరేగించారు. దారి పొడవునా భక్తులు గణపతిని దర్శించుకొన్నారు. ఊరేగింపులో యువత ఉత్సవంగా పాల్గొని సందడి చేశారు. అనంతరం పోలవరం, ఏలేరు కాలవ, సమీప పంట కాలువల్లో గణపతిని నిమజ్జనం చేశారు.

పంపా నదిలో నిమజ్జనాలు

అన్నవరం: గణపతి నవరాత్రులు ముగియడంతో రత్నగిరిపై సత్యదేవుని దర్బారు మండపం, యంత్రాలయం తదితర చోట్ల ప్రతిష్ఠించిన గణపతి విగ్రహాలను సోమవారం ఘనంగా ఊరేగించి పంపా నదిలో నిమజ్జనం చేశారు. అలాగే అన్నవరం, చుట్టుపక్కల గ్రామాల్లో ప్రతిష్ఠించిన గణపతులను కూడా పంపా నదిలో నిమజ్జనం చేశారు. సాయంత్రం నాలుగు గంటలకు రత్నగిరిపై గణపతి ఊరేగింపు ప్రారంభమైంది. ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌పై స్వామివారిని ఊరేగించి పంపా నదిలో నిమజ్జనం చేశారు. పంపా స్నానఘట్టాలు వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా క్రేన్ ఏర్పాటు చేశారు.

తొండంగి: వినాయక చవితి ఉత్సవాలు ముగియడంతో సోమవారం మండలంలోని గణేశ్ నిమజ్జనాలు ఘనంగా జరిగాయి. మండలంలోని వేమవరం, యాదాలవారిఊరు, అన్నయ్యపేట, వాడముసలయ్యపేట, జీఎం పేట, ఎల్లయ్యపేట, దానవాయిపేట, నర్శిపేట, ఒంటిమామిడి తదితర గ్రామాల్లో నెలకొల్పిన విగ్రహాలను మేళతాళాలు, బాణసంచా కాల్పుల నడుమ ఊరేగించి సముద్రతీరాల్లో నిమజ్జనం చేశారు. పెరుమాళ్లపురం, అద్దరిపేట, పంపాదిపేట, యర్రయ్యపేట, కొత్తచోడిపల్లిపేట తదితర సముద్ర తీరాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్సై జగన్మోహన్‌రావు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మెట్ట గ్రామాల్లో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలను పంపా తీరంలో నిమజ్జనం చేశారు. పలు గ్రామాల్లో అన్నసమారాధనలు నిర్వహించారు.

అన్నదానం

గండేపల్లి/జగ్గంపేట: గణపతి నవరాత్రుల్లో భాగంగా గండేపల్లి, జగ్గంపేట మండలాల్లోని గ్రామాల్లో సోమవారం అన్నసమారాధనలు నిర్వహించారు. గండేపల్లి మండలం ఉప్పలపాడులో లక్ష్మీగణపతి ఆలయం వద్ద మేడిబోయిన శ్రీను బ్రదర్స్ ఆధ్వర్యంలో అన్న సమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్న ప్రసాదాలు స్వీకరించారు. జగ్గంపేట-గోకవరం రోడ్డులోని గణేశ్ మండపం వద్ద కృష్ణ ట్యాక్సీ స్టాండ్ ఆధ్వర్యంలో భారీ అన్నదానం నిర్వహించారు.

గోకవరం: గణపతి నవరాత్రులు ముగింపు దశకు చేరుకోవడంతో మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం గణపతి విగ్రహాల నిమజ్జనాలు ఘనంగా జరిగాయి. స్థానిక వెలమపేటలోని మద్దాల బ్రదర్స్ వీధిలో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహం వద్ద సోమవారం భారీ అన్నదానం నిర్వహించారు. వేలాది మంది భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అనంతరం గణేశ్ విగ్రహాన్ని ఘనంగా ఊరేగించి నిమజ్జనం చేశారు. అలాగే స్థానిక లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాన్ని గ్రామంలో భారీగా ఊరేగించారు. ఈ ఊరేగింపులో కోలాటం, బాణసంచా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పలు గ్రామాల్లో గణేశ్ ఊరేగింపులు ఘనంగా జరిగాయి.

స్వామివారిని దర్శించుకున్న ముద్రగడ పద్మనాభం



కిర్లంపూడిలో స్వామివారిని దర్శించుకున్న ముద్రగడ పద్మనాభం

కిర్లంపూడి: మండలవ్యాప్తంగా సోమవారం గణపతి నిమజ్జనోత్సవాలు వైభవంగా జరిగాయి. కిర్లంపూడి యల్లపువారి వీధిలో బాలగణపతిని కాపు ఉద్యమ నేత, వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండపం వద్ద ఏర్పాటు చేసిన అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆయా గ్రామాల్లో స్వామివారిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. కిర్లంపూడి ఏనుగువీధి సెంటర్, చిల్లంగి, జగపతినగరం, కొత్తపేట, రమణయ్యపేట, శ్రీరామ్‌నగర్, కాపుల రామాలయం వద్ద ఏర్పాటు చేసిన గణనాథులను డీజే సౌండ్, తీన్మార్ డ్యాన్స్‌ల నడుమ గ్రామంలో ఊరేగించారు. జగపతినగరంలోని నరసయ్యపేటలో వినాయక మండపం వద్ద భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

నేటి నుంచి సేవా పక్షోత్సవాలు



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లా శ్రీనివాస్

ఏలేశ్వరం: ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని మంగళవారం నుంచి సేవా పక్షోత్సవాలు నిర్వహించనున్నట్టు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లా శ్రీనివాస్ తెలిపారు. స్థానిక మందు కాలనీలోని పార్టీ కార్యాలయంలో పట్టణాధ్యక్షుడు రెడ్డి లోవరాజు అధ్యక్షతన సోమవారం పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. దీనిలో భాగంగా రక్తదాన శిబిరాలు, వైద్య శిబిరాలు, పాఠశాలల్లో స్వచ్ఛత కార్యక్రమాలు, స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలను శుభ్రం చేయుట తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు రెడ్డి వరలక్ష్మి, శీరం తలుపులమ్మ, దేగల నాగమణి, వంగలపూడి సత్యవేణి, దేగల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు రూరల్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకూ బీజేపీ ఆధ్వర్యంలో సేవా పక్షోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు తెలిపారు. ఈ మేరకు సోమవారం మండలంలోని యాజే పురంలో బీజేపీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.

ఘనంగా మిలాద్-ఉన్-నబీ వేడుకలు



ఏలేశ్వరంలో కేక్ కట్ చేస్తున్న ముస్లింలు



జగ్గంపేటలో ఊరేగింపు నిర్వహిస్తున్న ముస్లింలు

ఏలేశ్వరం: మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని పట్టణంలో సోమవారం ముస్లింలు మిలాద్-ఉన్-నబీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక మార్కెట్ రోడ్డులోని జామియా మసీదులో అంజుమాన్ కమిటీ ఆధ్వర్యంలో ముస్లింలు కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా కమిటీ నాయకులు మాట్లాడుతూ విశ్వశాంతికి ప్రతీకగా ఏటా మిలాద్-ఉల్-నబీ వేడుకలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మహ్మద్ ప్రవక్త బోధించిన ప్రపంచశాంతి, విశ్వమానవ సౌభ్రాతత్వం నేటి తరానికి అనుసరణీయమన్నారు. అనంతరం పట్టణంలోని మార్కెట్ రోడ్డు, బాలాజీ చౌక్, నర్సీపట్నం రోడ్డు, మెయిన్ రోడ్డు మీదుగా ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

గండేపల్లి/జగ్గంపేట: మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా జగ్గంపేటలో ఈద్ మిలాన్ ఉన్ నబీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మసీదు నుంచి భారీ ఊరేగింపు నిర్వహించారు. మసీదు కమిటీ గౌరవాధ్యక్షుడు, వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ అధ్యక్షుడు ఎస్ఏ గఫూర్, మాజీ డైరెక్టర్ ఎస్‌కే సయ్యద్ బాబ్జీ, షేక్ సలీం, ఎండీ బాబు తదితరులు పాల్గొన్నారు. సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. యూనివర్సిటీ ఛాన్సలర్ ఎన్.సతీష్‌రెడ్డి ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఇదేం దారిద్ర్యం!

- వర్షాలకు ఛిద్రమైన రహదారులు
- గోతుల్లో నీరు చేరి తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు



తొండంగి మండలం దానవాయిపేటలో రహదారిపై గోతుల్లో చేరిన నీరు

తొండంగి: వాయుగుండం ప్రభావంతో ఇటీవల కురిసిన కుండపోత వర్షాలకు గ్రామాల్లోని రహదారులు పూర్తిగా ఛిద్రమయ్యాయి. మండలంలోని ప్రధాన రహదారులు గోతులమయంగా మారడంతో రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దానవాయిపేట బీచ్‌రోడ్డులో కుండపోత వర్షాలకు భారీ గుంతలు పడ్డాయి. ముఖ్యంగా దానవాయిపేట మెయిన్ సెంటర్ ఆంజనేయస్వామి విగ్రహం వద్ద, ఒంటిమామిడి అంబేడ్కర్ విగ్రహం సెంటర్, ఎల్లయ్యపేట, జి.మునలయ్యపేట, తదితర ప్రాంతాల్లో రెండు అడుగుల లోతు వరకూ గుంతలు పడ్డాయి. ఆయా గోతుల్లో నీరు చేరడంతో వాహనదారులు రాకపోకల సమయంలో ప్రమాదాల బారిన పడుతున్నారు. తీర ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందడంతో ఈ రోడ్డులో వాహనాల రద్దీ పెరిగింది. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆర్అండ్‌బీ అధికారులు తక్షణమే స్పందించి రహదారి మరమ్మతులకు చర్యలు చేపట్టాలని ప్రజల కోరుతున్నారు.

అధ్వానంగా తుని-నర్సీపట్నం రోడ్డు

కోటనందూరు: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తుని-నర్సీపట్నం రోడ్డు అధ్వానంగా మారింది. అసలే శిథిలావస్థలో ఉన్న రోడ్డు..ఆపై కురిసిన భారీ వర్షాలకు రోడ్డు దుస్థితి వర్ణనాతీతంగా మారింది. తుని నుంచి జిల్లా సరిహద్దు కాకరాపల్లి శివారు వరకూ అడుగుకొక గుంత ఏర్పడి ప్రయాణికులకు నరకం చూపిస్తోంది. ఈ గుంతల రోడ్డులో భారీ వాహనాలు సైతం మరమ్మతులకు గురతున్నాయి. ద్విచక్రవాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రివేళ ప్రయాణం ప్రమాదకరంగా మారిందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ముందు ఆర్అండ్‌బీ అధికారులు అక్కడక్కడ గుంతల్లో కాస్తంత రాళ్లతో కూడిన మట్టి వేసి ప్రమాణికులను మరింత ఇబ్బందుల్లోకి నెట్టేశారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కాకరాపల్లిలో రోడ్డుపై నిల్వ ఉన్న నీరు, మధ్యలో ఏర్పడిన గుంత

మోటారు సైకిల్ చోరీ

తుని రూరల్: మోటారు సైకిల్ చోరీపై కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్సై బి.కృష్ణామాచారి తెలిపారు. వివరాల్లోకి వెళితే...తొండంగి మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన చెంచయ్యకు తుని మండలం హంసవరంలో సాగుభూమి ఉంది. పొలం పనులు చేసుకునేందుకు గత నెల 26న ఉదయం ఏడు గంటలకు మోటార్ సైకిల్‌పై పొలానికి వెళ్లాడు. రోడ్డు పక్కన బైక్ పార్కింగ్ చేసి పొలం పనులు ముగించుకుని తిరిగి మధ్యాహ్నం వచ్చి చూడగా మోటార్ సైకిల్ కనిపించలేదు. అప్పటి నుంచి వివిధ ప్రాంతాల్లో వెతికినా బైక్ ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వివరించారు.

2, 314 మంది రైతులకు పంట నష్టం

తుని రూరల్: తుని వ్యవసాయ సబ్ డివిజన్‌లో ఇటీవల సంభవించిన వరదలకు 2314 మంది రైతులకు పంట నష్టం వాటిల్లినట్టు వ్యసాయ సహాయ సంచాలకులు సుంకర బుల్లిబాబు తెలిపారు. వరదనీరు తగ్గుముఖం పట్టడంతో పంట నష్టం గణన పూర్తయ్యిందని సోమవారం ఏడీఏ తెలిపారు. 2062.50 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయన్నారు. తుని మండలంలో 582 మందికి చెందిన 311 ఎకరాలు, తొండంగి మండంలో 1485 మంది రైతులకు చెందిన 1555 ఎకరాలు, కోటనందూరు మండలంలో 116 మంది రైతులకు చెందిన 94.6 ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు. రౌతులపూడి మండలంలో 74 మందికి చెందిన 65.38 ఎకరాలు, శంఖవరం మండలంలో 57 మంది రైతులకు చెందిన 36.5 ఎకరాల్లో వరద నష్టం సంభవించినట్టు ఆయన వివరించారు. రైతు సేవా కేంద్రాలు, గ్రామ సచివాలయాల్లో బాధితుల జాబితాను రైతులకు అందుబాటులో ఉంచుతామన్నారు. అభ్యంతరాలు ఉంటే మంగళ, బుధవారాల్లో రాతపూర్వకంగా తెలియజేయాలన్నారు. ప్రభుత్వం ఎకరాకు రూ.10 వేల చొప్పున నష్ట పరిహారం ప్రకటించిందని చెప్పారు.

ఇసుక అక్రమ తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు

తుని రూరల్: తాండవ నదిలో ఇసుక అక్రమ తవ్వకాలు, తరలింపునకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.చెన్నకేశవరావు సోమవారం హెచ్చరించారు. అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు, రవాణా చేయరాదన్నారు. గృహ నిర్మాణదారులు సొంత అవసరాలకు ఎడ్లబళ్లపై ఇసుకను తీసుకువెళ్లవచ్చని తెలిపారు.

నిండా ముంచిన వర్షాలు

- అతివృష్టి, వరదలకు భారీగా పంట నష్టం
- అంచనా వేసిన అధికారులు
- ఇప్పుడిప్పుడే తేరుకుంటున్న పైర్లు

సబ్‌డివిజన్‌లో సాగు వివరాలు

మండలం	సాధారణ వరిసాగు (ఎకరాల్లో)	నాట్లు వేసింది (ఎకరాల్లో)
తుని	6525	6145
తొండంగి	13340	12750
కోటనందూరు	9767	9767
శంఖవరం	3213	2040
రౌతులపూడి	5083	5083
మొత్తం	37923	35785



తాండవ రిజర్వాయర్ నుంచి నదిలోకి విడుదలవుతున్న అదనపు జలాలు

తుని రూరల్: ఈ సంవత్సరం ఖరీఫ్ రైతులను వరుస తుపానులు నిండా ముంచాయి. ఇటీవల వారం రోజుల పాటు కురిసిన భారీ వర్షాలకు వ్యవసాయశాఖ తుని సబ్‌డివిజన్ ఐదు మండలాల్లో వేలాది ఎకరాల్లో వరి, పత్తి, ఇతర పంటలు నీట మునిగాయి. ఐదు మండలాల్లో సాధారణ ఖరీఫ్ సాగు 37,923 కాగా ఈ ఏడాది 35,765 ఎకరాల్లో రైతులు నాట్లు వేశారు. వి.కొత్తూరు, రాజుపేట, లోవకొత్తూరు తదితర గ్రామాల్లో ఇంకా 2138 ఎకరాల్లో వరినాట్లు వేయాల్సి ఉంది. ఇటీవల కురిసిన వర్షాలతో నీరు అందుబాటులోకి రావడంతో ఆయా గ్రామాల్లో నాట్లు వేస్తున్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌కు సాధారణ కంటే అధికంగా వర్షపాతం నమోదైంది. రిజర్వాయర్లు, చెరువుల్లో నీటి నిల్వలు ఆశాజనకంగా ఉన్నాయి. ఇటీవల సంభవించిన తుపాను వల్ల సబ్ డివిజన్‌లో 2314 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్టు అధికారులు తెలిపారు. ఎకరాకు రూ.పది వేలు చొప్పున పరిహారం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో నియోజకవర్గానికి రూ.2 కోట్లకుపైగా అందాల్సి ఉంది.

రిజర్వాయర్లలో నీటి నిల్వలు

వర్షాలకు రిజర్వాయర్లు నిండుకుండల్లా మారాయి. 380 అడుగులు గరిష్ఠ నీటిమట్టం కలిగిన తాండవ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 378.05 అడుగులు నీటి నిల్వలు ఉన్నాయి. అధికారులు పంట కాలువలకు నీరు విడుదల చేస్తున్నారు. పంపా రిజర్వాయర్ గరిష్ఠ నీటి మట్టం 105 అడుగులు కాగా ప్రస్తుతం 99.80 అడుగులు నీటి నిల్వలు ఉన్నాయి. ఏలేరు రిజర్వాయర్ గరిష్ఠ నీటి మట్టం 283.99 అడుగులు కాగా ప్రస్తుతం 280.71 అడుగులు నీటి నిల్వలు ఉన్నాయి. సాగునీటి చెరువులు సైతం నిండుకుండల్లా కళకళలాడుతున్నాయి. ఈ నిల్వలతో ఖరీఫ్‌సాగు పూర్తవుతుందని వ్యవసాయ అధికారులు పేర్కొన్నారు.

పంట నీట మునిగింది

కేఎంఆర్ ట్యాంకు (చెరువు) ఎగువన రెండున్నర ఎకరాల్లో వరినాట్లు వేశాను. పంపా వరద కాలువ, పుష్కర కాలువ నుంచి అదనపు జలాలు, వర్షపునీరు వచ్చి చేరడంతో చెరువులో కళింగలుపై వరదనీరు పొంగి ప్రవహిస్తుండగా బ్యాక్ వాటర్‌తో ఎగువ ఉన్న మా భూముల్లో వరిపైర్లు ముంపునకు గురైంది. అధికారులు పంట నష్టాన్ని నమోదు చేసుకున్నారు. పరిహారం అందాల్సి ఉంది.

– కె.సత్యనారాయణ, రైతు, హంసవరం,

సమగ్ర పంట నష్టం గణన పూర్తి

వర్షాలు పూర్తిగా తగ్గుముఖం పట్టడంతో సమగ్ర పంట నష్టం గణన పూర్తి చేశాం. బాధితుల జాబితాలు రైతు సేవా కేంద్రాలు, గ్రామ సచివాలయాల్లో అందుబాటులో ఉంచాం. అభ్యంతరాలు ఉంటే రెండు రోజుల్లో వీఏఏ, ఏఓలకు రైతులు తెలియజేయాలి.

– సుంకర బుల్లిబాబు, ఏడీఏ, తుని

విజయవాడ వరద బాధితులకు విరాళాల సేకరణ



గోకవరంలో జోలె పట్టి విరాళాలు సేకరిస్తున్న నాయకులు

గోకవరం: విజయవాడలో వరద బాధితుల సహాయార్థం గోకవరంలో అన్ని యూనియన్లు, స్థానిక నాయకులు చేపట్టిన విరాళాల సేకరణ సోమవారం రెండో రోజూ కొనసాగింది. గోకవరంలో వారపు సంత రోజున జోలి పట్టి విరాళాలు సేకరించారు. శ్రీలక్ష్మీ గణపతి మినీ ట్రాన్స్‌పోర్టు టాటా ఏసీ యూనియన్ సభ్యులు రూ.5 వేలు విరాళం అందించగా మొత్తం రూ.13 వేలు సేకరించారు. బుధవారం కొత్తపల్లిలో కూడా విరాళాలు సేకరించి మొత్తాన్ని విజయవాడ వరద బాధితులకు పంపిస్తామని గవిని దుర్గాప్రసాద్, చోడిశెట్టి గోపీ, ముప్పిడి నాగేశ్వరరావు తదితరులు తెలిపారు.